

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# పెళ్లి సందడిలో ప్రైవేట్ సైన్యం



- స్టేటస్ సింబల్‌గా మారిన బౌన్సర్లు
- గ్రామీణ ప్రాంతాలకూ పాకిన సెక్యూరిటీ షో
- అతిథుల పట్ల అమర్యాద
- అక్షింతలకూ ఆంక్షలు
- మహిళలకు కూడా తప్పని అవమానాలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** "పెళ్లంటే పందిళ్లు.. సందళ్లు తప్పెట్లు.. తాళాలు తలంబ్రాలు.. మూడు ముళ్లు ఏడు అడుగులు.. మొత్తం కలిపి నూరేళ్లు" అంటూ ఒకప్పుడు సినీ గేయకవి పెళ్లి వైభవాన్ని వర్ణించారు. కానీ, మారుతున్న కాలంతో పాటు ఇప్పుడు ఆ పాటలో బౌన్సర్ల పేరు కూడా చేర్చాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం వివాహ వేడుకల్లో బౌన్సర్ల హంగామా సర్వసాధారణమైపోయింది.

**సామాన్యుల వేడుకల్లోనూ ఓవర్ యాక్షన్**

ఒకప్పుడు కేవలం నగర ప్రాంతాల్లోని రాజకీయ నాయకులు, సినీ సెలబ్రిటీల పెళ్లిళ్లకే పరిమితమైన ఈ బౌన్సర్ల ట్రెండ్, ఇప్పుడు సామాన్యుల ఫంక్షన్ల లోనూ కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాలకూ ఈ ప్రైవేట్ సైన్యం గత పదేళ్లుగా విస్తరించింది. నల్లటి సఫారి దుస్తులు ధరించి, కండలు తిరిగిన యువకులు చేతిలో వాకీటాకీలు పట్టుకొని పెళ్లి పందిళ్లలో హల్ చల్ చేయడం ఇప్పుడు ఒక 'స్టేటస్ సింబల్'గా మారింది.

హైదరాబాద్‌లోనే సుమారు 50 నుండి 80 వరకు ప్రముఖ ప్రైవేట్ బౌన్సర్ ఏజెన్సీలు నడుస్తున్నాయి. వివాహ వేడుకల్లో భద్రతను పర్యవేక్షించడం, బార్ కౌంటర్లు, డ్యాన్స్ ఫ్లోర్ల వద్ద అతిథులు మద్యం సేవించి చేసే రభసను అదుపు చేయడం, విలువైన నగదు, నగలు ఉన్న ప్రాంతాల్లో రక్షణ కల్పించడం బౌన్సర్ల ప్రధాన విధి. ఈ సేవలకు గానూ బౌన్సర్ల అనుభవం, గంటల ఆధారంగా ఛార్జీలు ఉంటాయి. 6 గంటలకు.. రూ. 1,500, 8 గంటలకు.. రూ. 2,000, 10 నుండి 12 గంటలపాటు సేవలకు రూ. 2,500 నుండి రూ. 3,000 వరకు ఛార్జ్ చేస్తారు. అనధికార వ్యక్తులను నియంత్రించడం వరకు బాగానే ఉన్నా, వధూవరులను ఆశీర్వదించడానికి వేదికపైకి వచ్చే బంధుమిత్రులపై బౌన్సర్లు ప్రవర్తిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఆశీర్వదించడానికి వచ్చే వారిని ఇష్టమొచ్చినట్లు పక్కకు నెట్టడం, లాగి పడేయడం వంటి చర్యలతో చాలామంది ఈ వ్యవస్థపై చిరాకు వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల పెళ్లికి రమ్మని స్వయంగా పిలిచి, తీరా అక్కడికి వెళ్లాక చేతులు అడ్డుపెట్టి ఆపడం, నెట్టేయడం వంటి అమర్యాదకరమైన చర్యలపై బంధువులు ఆవేదన చెందుతున్నారు. పలు సందర్భాల్లో మహిళలకు కూడా అవమానాలు తప్పడం లేదని ప్రస్తావిస్తున్నారు.

**గౌరవించాల్సిన బాధ్యత పిలిచిన వారిదే..**

అతిథి దేవోభవ అని చిన్ననాట నేర్చుకున్న మనమే ఇలా ఆహ్వానించి అవమానించడం తగదు. పెళ్లికి వచ్చిన వారంతా వధూవరులను చూసేందుకు తోసుకువచ్చే అభిమానులు కారు, వేదికపై ఉన్నవారేం సినీ నటులు కారు.

ఎంతో వ్యయప్రయాసలకోర్చి వచ్చిన వారిని గౌరవించాల్సిన బాధ్యత పిలిచిన వారిదే.. అని ఓ రిటైర్డ్ ఉపన్యాసకురాలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఫాల్స్ స్టేటస్ మంచిది కాదు**

డబ్బు, హోదా, పలుకుబడి చూపించుకోవడానికి వివాహ వేదికలను వేదికలుగా మార్చుకుని ఇలాంటి ఫాల్స్ స్టేటస్ సింబల్స్‌కు పోవడం సరికాదని పెద్దలు హితవు పలుకుతున్నారు. ఈ బౌన్సర్ల సంస్కృతి వల్ల పవిత్రమైన వివాహ వ్యవస్థకే చెడ్డపేరు వస్తోందని, పిలిస్తే వచ్చిన అతిథులను గౌరవించి, సాంప్రదాయ పద్ధతుల్లోనే వివాహాలను జరిపించుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

**బాహుబలి సీన్లను తలపిస్తున్న దౌర్జన్యం**

పలు వివాహాల్లో బౌన్సర్ల దౌర్జన్యం బాహుబలి సినిమా సీన్లను తలపిస్తోంది. దేవసేనను, ఆమెతో ఉన్న మహిళలను భుజాలపై చేతులు వేసి ఆపేసే దండనాయకుడి ఘట్టంలాగే నేడు బౌన్సర్లు కూడా స్త్రీ, పురుష బేధం లేకుండా చేతులు అడ్డుపెట్టి ఆపేస్తున్నారు. వాళ్లు ఆదేశించినప్పుడే వేదికపైకి వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది.

**నర్సింహులు గుప్తా (డీసీఎంఎస్ మాజీ చైర్మన్)**



మొయినాబాద్ చౌరస్తాలో ఫుట్‌పాత్‌పై కబ్జాను పరిశీలిస్తున్న కమిషనర్, పోలీసు అధికారులు

# తప్పుకోకపోతే.. తొక్కేస్తాం

## ఒత్తిళ్లకు భయపడను

**మొయినాబాద్, జూన్ 19, ప్రభాత వార్త :** మొయినా బాద్ చౌరస్తాలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొన్ని కమర్షియల్ భవనాల యజమానులు తమ హద్దులను దాటి ఫుట్‌పాత్‌లు, రోడ్డు స్థలాలను ఆక్రమించినట్లు గుర్తించామని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. ఆక్రమించిన స్థలాలను కొందరు చిరు వ్యాపారులకు అద్దెకు ఇచ్చి వ్యాపారాలు నిర్వహింపజేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింద న్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలు, ఆక్రమ ణలపై ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. సంబంధిత భవన యజమా నులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలని, లేదంటే సోమవారం నుంచి మున్సిపల్ యంత్రాంగం వాటిని తొలగించే చర్యలు చేపడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు, ఫుట్‌పాత్‌లు, రహదారులపై ఎలాంటి అక్రమ నిర్మాణాలనైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

**ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే..**

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు మున్సిపల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా చర్యలు ప్రారంభించాయి. ట్రాఫిక్ రద్దీ, రోడ్లపై అక్రమ కబ్జాలు, వర్షాకాలంలో హైవేపై నీరు నిలిచిపోవడం వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్‌తోపాటు మొయినాబాద్ సీఐ మల్లికార్జున రెడ్డి, ట్రాఫిక్ పోలీసులతో కలిసి అజీజ్‌నగర్ చౌరస్తా, హిమాయత్‌నగర్ చౌరస్తా, మొయి నాబాద్ చౌరస్తాలను సందర్శించి ట్రాఫిక్‌కు ఆటంకంగా మారుతున్న అంశాలను పరిశీలించారు. రహదారులపై అక్రమంగా నిర్మించిన షెడ్లు, దుకాణాలు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, వర్షపు నీటి పారుదల వ్యవస్థల పరిస్థితిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కార్యా చరణ రూపొందించారు.

**ప్రజా ప్రయోజనాలే ముఖ్యం**

ప్రజా ప్రయోజనాలే తమకు ముఖ్యమని, ఈ విషయంలో రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు లేదా ఇతరుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వాటికి తలొగ్గే ప్రసక్తే లేదని కమిషనర్ జాకీర్ అహ్మద్ స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఆక్రమణలపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**వర్షపు నీటి నిల్వపై ప్రత్యేక దృష్టి..**

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ మాట్లాడుతూ, అజీజ్‌నగర్ చౌరస్తాలో వర్షాలు కురిసిన సమయంలో భారీగా నీరు హైవేపై నిలుస్తుందని, దీనివల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి వర్షపు నీటిని మళ్లించే ప్రత్యేక మార్గాలను గుర్తిం చామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అదేవిధంగా హిమాయత్‌నగర్ చౌరస్తాలోని ఉడిపి హోటల్ సమీపంలో నాలా మూసుకుపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లక రోడ్డుపైనే నిలుస్తోందని వివరించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాల అవకాశాలు పెరుగు తున్నాయని పేర్కొన్నారు. నాలాను వెంటనే శుభ్రపరచి నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. మొయినాబాద్ సీఐ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి అత్యంత రద్దీగా ఉండే మార్గమని పేర్కొన్నారు. బాలాజీ టెంపుల్‌కు ప్రతిరోజూ వేలాది మంది భక్తులు రావడం, ఈ ప్రాంతంలో ఇంజినీరింగ్ కళాశాలలు అధికంగా ఉండటం వల్ల అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, మొయినాబాద్ చౌరస్తాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు

మిగతా 2లో

### వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజా స్థలాలను కాజేస్తే సహించబోం

### ఫుట్‌పాత్ ఆక్రమణదారులకు మున్సిపల్ కమిషనర్ వార్నింగ్





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ వెంకటాచారి

# ఇంటింటి సర్వేకు 1,133 మంది బిఎల్‌వోలు

## 25 నుంచి ప్రారంభానికి ఏర్పాట్లు

## అదనపు కలెక్టర్ వెల్లడి

**వికారాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాదు నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. వెంకటాచారి, జిల్లాలో జరుగుతున్న సన్నాహకాలను వివరించారు. ఈనెల 25వ తేదీ నుంచి చేపట్టనున్న ఇంటింటి సర్వే కోసం జిల్లా వ్యాప్తంగా 1,133 మంది బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓ) ఇప్పటికే పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై నియోజకవర్గ మరియు జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, ఆ వివరాలను మినిట్స్ రూపంలో నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే మరోమారు రాజకీయ పార్టీలతో సమావేశమై బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై స్పష్టతనిస్తామని ఆయన వెల్లడించారు. జిల్లాకు అందిన బీఎల్ఓ కిట్లు ప్రచార సామాగ్రిని ఇప్పటికే పంపిణీ చేశామని, ఎన్యూమరేషన్ ఫారాలను కూడా క్షేత్రస్థాయి అధికారులకు అందజేసే ప్రక్రియ వేగవంతం చేశామని ఆయన ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# మా ఊళ్లో మాకే ఎదురు చెబుతారా!

- మద్యం మత్తులో కౌన్సిలర్ కుమారుడి వీరంగం
- బైక్ ఓవర్ స్పీడ్ వద్దన్నందుకు ఆగ్రహం
- ప్రయాణికుల కారు అడ్డగించి రాళ్లతో దాడి
- అడ్డుకున్న పోలీసులతోనూ తోపులాట
- పోలీసులు సహా పలువురికి గాయాలు



ధ్వంసమైన కారు

**మొయినాబాద్, జూన్ 19, ప్రభాతవార్త :** మద్యం మత్తులో బైక్‌పై వెళ్తూ వాహనదారులతో వాగ్వాదానికి దిగిన ఓ కౌన్సిలర్ కుమారుడు తన అనుచరులతో కలిసి కారు అడ్డగించి రాళ్లతో దాడి చేయడంతో పాటు, అమ్మాయిలు యువకులపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. ఈ ఘటనలో పలువురికి గాయాలు కాగా, కారు ధ్వంసమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని వనస్థలిపురం ప్రాంతానికి చెందిన వీవీఎన్ సెరైల్ (28) తన స్నేహితులతో కలిసి మూడు కార్లలో శుక్రవారం ఉదయం వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి ప్రాంతానికి విహారయాత్రకు బయలుదేరాడు. చిలుకూరు గ్రామ సమీపానికి చేరుకోగానే స్థానిక కౌన్సిలర్ కుమారుడు అశోక్ కుమార్ మద్యం సేవించి బైక్‌పై సెల్‌ఫోన్ మాట్లాడుతూ కారుకు అడ్డంగా వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఓవర్ స్పీడ్‌గా వెళ్తున్నారు అంటూ కారులో ఉన్న వారిని అసభ్య పదజాలంతో దూషించినట్లు సమాచారం.

కారులో యువతులు కూడా ఉండటంతో వారు స్పందిస్తూ, మా కారు మీ బైక్‌ను తాకలేదు కదా, ఎందుకు దూషిస్తున్నారు.. అని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీంతో ఆగ్రహానికి గురైన అశోక్ కుమార్ వారిని వెంబడించినట్లు బాధితులు తెలిపారు. అనంతరం చిలుకూరు గ్రామంలో అభి, ఆకాశ్, మల్లేష్, నర్సింలు, అశోక్ భార్యతో పాటు మరికొందరు వ్యక్తులు కలిసి కారును అడ్డగించి రాళ్లతో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దాడిలో కారు అద్దాలు ధ్వంసమవగా, కారులో ప్రయాణిస్తున్న పలువురు గాయపడినట్లు బాధితులు పేర్కొన్నారు. భయాందోళనకు గురైన బాధితులు వెంటనే డయల్ 100కు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గొడవను ఆపేందుకు ప్రయత్నించిన పోలీసులు ఇరువర్గాలకు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించినప్పటికీ, ఆగ్రహంతో ఉన్న కొందరు వ్యక్తులు పోలీసుల మాట వినకుండా దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ క్రమంలో పోలీసు సిబ్బందికి కూడా స్వల్ప గాయాలు అయినట్లు తెలిసింది. ఘటన అనంతరం వనస్థలిపురానికి చెందిన వీవీఎన్ సెరైల్ మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దాడికి పాల్పడిన వారి పాత్ర, సంఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైంది కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పోలీసుల సమక్షంలోనే దౌర్జన్యానికి పాల్పడడం ఆందోళన కలిగించే విషయమని సీఐ మల్లికార్జున రెడ్డి చట్టాన్ని కాపాడవలసిన ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులే ఇలా ప్రవర్తిస్తే సామాన్య ప్రజల ప్రవహిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి స్థానిక నాయకులు గమనించాలని పేర్కొన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు, స్థానికులు కోరుతున్నారు.

# 19మంది బిల్ కలెక్టర్లకు మూకుమ్మడి ఉద్వాసన

★ అలియాబాద్ మున్సిపాలిటీలో సంచలనం ★ ఒకేసారి బదిలీలపై పాలకవర్గ సభ్యుల ధ్వజం ★ వార్డులలో ఎఫెక్ట్ పడుతుందని ఆందోళన

**శామీర్‌పేట, జూన్ 19, ప్రభాతవార్త :** అలియాబాద్ మున్సిపల్ పరిధిలో ఒకేసారి 19మంది బిల్‌కలెక్టర్లను బదిలీలు చేయటంపై వైస్‌చైర్మన్, కౌన్సిలర్లకు సమాచారం కూడ ఇవ్వకుండ ఎలా బదిలీలు చేస్తారని దీనికి కారణాలను తెలియజేయాలని, బదిలీలను వెంటనే నిలిపివేయాలని వైస్‌చైర్మన్ కె.మాలతి, పలువురు కౌన్సిలర్లు కలిసి

మిగతా 2లో



బదిలీలను నిలిపివేయాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైస్‌చైర్మన్ మాలతి, కౌన్సిలర్లు

# రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

## చౌదరిగూడలో స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## రైతులు నష్టపోకుండా భూసేకరణకు హామీ



ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్ జూన్ 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో పెద్దపీట వేస్తూ సిఎం రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ రూపకల్పన చేశారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శుక్ర వారం శంషాబాద్ మండల పరిధిలోని చౌదరిగూడా గ్రామంలో రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్కూల్ నిర్మాణానికి సంబంధించిన మౌలిక వసతులు, రోడ్డు కనెక్టివిటీపై అధికారులతో చర్చించారు. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు వెళ్లే అనుసంధాన (అప్రోచ్) రోడ్డు సమస్యను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చొరవ తీసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న స్థానిక రైతులతో ఆయన స్వయంగా మాట్లాడారు. నష్టపోతున్న రైతు లకు ప్రత్యామ్నాయంగా ఇతర ప్రదేశాలలో వారికి అనువైన ప్రభుత్వ భూమిని కేటాయించేలా చూస్తా మని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో రైతులు సైతం సానుకూలంగా స్పందించడంతో రోడ్డు సమస్య సుఖాంతమైంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.


# 21 నుంచి కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ వన్ వే

## అభివృద్ధి పనుల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసుల నిర్ణయం

**జూబ్లీహిల్స్, జూన్ 19, ప్రభాతవార్త:**

ఒకవైపు పర్యావరణ ప్రేమికుల ఆందోళనలు.. మరోవైపు అభివృద్ధికి పడుతున్న అడుగులు.. వెరసి కేబీఆర్ జాతీయ ఉద్యానవనం చుట్టూ ప్రభుత్వం చేపడుతున్న హెచ్‌సిటి అభివృద్ధి పనులు ఇప్పుడు వేగిరంగా సాగుతున్నాయి.. నగరంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు ప్రభుత్వం ఈ పనులకు ఉపక్రమించింది.. పనుల నేపథ్యం లో ఉద్యానవనం చుట్టూ ఉన్న పచ్చదనంపై గొడ్డలివేటు వేస్తున్నా రంటూ మరోవైపు పర్యావరణ ప్రేమికులు గత కొంత కాలంగా సేవ్ కేబీఆర్ పేరుతో ఆందోళనకు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు.. ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారమని వాహనదారులు, కొందరు అధికారులు చెబుతుంటే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని పర్యావరణ ప్రేమికులు ఈ ఆందోళన కొనసాగిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే బంజా రాహిల్స్ రోడ్ నంబరు 2లో పనులను ప్రారంభించింది. ఇక్కడే కాకుండా క్యాన్సర్ ఆసుపత్రి కూడలి, రోడ్ నంబరు 12 కూడలిలో అండర్‌పాస్‌ల పనులను చేపడుతోంది. తాజాగా కేబీఆర్ ఉద్యాన వనం నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు వెళ్లే దారిలోనూ పనులు ప్రారంభించింది. ఈ క్రమంలోనే ఒకవైపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. వాహనదారులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ఇప్పటికే ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయంగా పలు మార్గాలు సూచించింది. వాహనదారులు ఆయా మార్గాలను ఉపయోగించుకోవాలని పలుమార్లు విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా జూబ్లీహిల్స్ డివిజన్ ఏసిపి కట్టా హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఇప్పటికే సైన్ బోర్డులు సైతం ఏర్పాటుచేసి వాహనదారులకు తెలియజేసేలా రహదారుల పక్కన బోర్డులు ఏర్పాటుచేశారు. ఈ నెల 21 నుంచి కేబీఆర్ ఉద్యానవనం చెట్టూ వన్ వే ఏర్పాటుచేయడానికి అవస రమైన ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు సిద్ధం చేశారు. అభివృద్ధి పనుల నేపథ్యంలో తాత్కాలికంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

# 26న పాతబస్తీలో బీబీ కా ఆలం ఊరేగింపు



ఊరేగింపు కోసం కేరళ నుంచి తీసుకువచ్చిన ఏనుగు శ్రీదేవి

**చార్మినార్, జూన్ 19 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ డబీర్ పురలోని చారిత్రాత్మక బీబీకా ఆలం ఊరేగింపు ఈనెల ఇరవై ఆరవ తేదీన పాతబస్తీలో జరగనుంది. బీబీకాలం ఊరేగింపులో పాల్గొనటానికి కేరళలోని కోజికోడ్‌కు చెందిన ఆడ (శ్రీ దేవి) ఏనుగు పాతబస్తీకి చేరుకుంది. డబీర్‌పుర నుంచి చార్మినార్, గుల్జారాహౌస్, పంజే షా, మీరాలం మండి, దారుషిఫా ప్రాంతాలు మీదుగా చాదర్‌ఘాట్ వరకు కొనసాగనున్న ఊరేగింపునకు నిజాం ట్రస్ట్, షియా ముస్లిం అంజు మన్ బృందాలు, అసుర్ ఖానా నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి. ఈ నెల 20వ తేదీ శనివారం పాతబ స్తీలోని ప్రధాన రహదారులలో కేరళ నుంచి తీసుకు వచ్చిన ఏనుగుతో రిహార్సల్ నిర్వహించనున్నారు.

# అలరించిన అక్షర నాట్య విన్యాసం



**రవీంద్రభారతి, జూన్ 19 ప్రభాతవార్త :** శ్రీశారద నృత్యనికేతన్ ఆధ్వర్యంలో సంస్థ నాట్యగురువు ఎం.శైలజప్రసాద్ శిష్యురాలు వి.లక్ష్మీసాయి అక్షర కూచిపూడి రంగప్రవేశం ముగ్ధమనోహరంగా కన్నుల పండువ చేసింది. రవీంద్రభారతిలో తన కూచిపూడి రంగప్రవేశాన్ని రంగపూజా నంతరం నాటరాగం ఆదితాళంలో విఘ్నదేవు డిని స్మరిస్తూ శ్రీ మహాగణపతి అంశం తో ప్రారంభించి మహదేవ శివశంభో, అన్నమా చార్య కీర్తన శ్రీమన్నారాయణ, భామా కలాపం-ప్రవేశ ధరువు, అన్నమాచార్య కీర్తన కులుకక నడవర, నారాయణతీర్థ తరంగం మరకట మణిమయ, త్యాగరాజ కృతి శ్రీ రఘుకులమందు, తిల్లానా చివరిగా రేవతిరాగం మిశ్రఛాపు తాళంలో నాగస్తుతి అంశాలను అత్యంత అద్భుత హావభావాలు ఒలికిస్తూ శృతిలయబద్ధంగా నాట్యవిన్యాసంతో ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది.

3 (20-6-26):3 (20-6-26).qxd 6/19/2026 10:21 PM Page 1



## రాహుల్‌గాంధి ప్రధాని కావాలని దర్గాలో ప్రత్యేక దువా

..టిపిసిసీ మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్

**పెద్దేముల్, జూన్ 19, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధి జన్మదినాన్ని పురస్కరించుకొని బీదర్ జిల్లాలోని గోడ్ వాడిలో గల ప్రముఖ హజ్రత్‌సయ్యద్ ఇస్మాయిల్ షా ఖాద్రి (రహ్మతుల్లా అలైహి) దర్గా షరీఫ్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు (దువా ) నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి,రియాజ్ అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యండి. రియాజ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఆయన దేశ ప్రధాని కావాలని దర్గాలో ప్రత్యేకంగా దువా చేశామని అన్నారు. దేశంలో శాంతి సౌభ్రాతృత్వం వర్ధిల్లాలన్నా, మైనార్టీ హక్కులు కాపాడాలన్నా రాహుల్‌గాంధి నాయకత్వం దేశానికి ఎంతో అవసరమని అన్నారు.



దర్గాలో ప్రార్థన (దువా) నిర్వహిస్తున్న యండి.రియాజ్

## ఘట్‌కేసర్ సర్కిల్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 19, ప్రభాత వార్త:** భారత దేశానికి దశ దిశను చూపించే యువ నాయకుడు రాహుల్ గాంధీయని డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో జరిగిన కాంగ్రెస్ నేత ఎంపీ. రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో భాగంగా డిసిసి అధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్ పాల్గొని కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్, డిసిసి కార్యదర్శి ముత్యాల్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, నాయకులు జంగయ్య , పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కర్రె రాజేశ్, మాజీ కౌన్సిలర్ కూతాడి రవీందర్, రాధాకృష్ణ ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరక్టర్ మశ్చేందర్‌రెడ్డి, నాయకులు మీసాల సుధాకర్, మాజీ సర్పంచ్ మేడబోయిన వెంకటేశ్ ముదిరాజ్, సొసైటీ బ్యాంకు మాజీ డైరక్టర్ బోక్కా ప్రభాకర్ రెడ్డి, మల్లేశ్, మేకల దాస్ తదితరులు పాల్గొన్నారు.




ఘట్‌కేసర్‌లో రాహుల్ పుట్టిన రోజు సందర్భంగా కేక్‌కట్‌చేస్తున్నడిసిసి అధ్యక్షుడు టి. వజ్రేశ్ యాదవ్ తదితరులు.

**పోచారం డివిజన్ పరిధిలో....**

పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ ఎన్‌టిపిసి చౌరాస్తాలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని ఆపార్టీ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కె. రాజేశ్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, పోచారం డివిజన్ ప్రధాన కార్యదర్శి మెట్ట గణేశ్‌యాదవ్, మాజీ ఎంపిటిసి శ్రీశైలం, నాయకులు పసూలాది నర్సింగ్‌రావు, బాస్కర్‌రెడ్డి, కె. వినోద్, కొంతం శంకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏర్ర రాజు, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఏర్ర మాధవి తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ పట్టణంలో..**

**మేడ్చల్, జూన్ 19. ప్రభాతవార్త :** రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మేడ్చల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ విచ్చేసి కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న మహానేత రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్, గుండ్లపోచంపల్లి ఎల్లంపేట మున్సిపాలిటీల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, విఘ్నేశ్వర్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు వర్దారెడ్డి, నాయకులు సంజీవరావు, రమేష్, రాఘవేందర్ గౌడ్, రవి, చాప రాజు, మల్లేష్ గౌడ్, దేవ, మహేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో కేక్ కట్ చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ నేతలు

## యాచారంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

**యాచారం, జూన్19, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీ ప్రజా అవసరాల కోసమే. పరిపాలన చేస్తుందని యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొట్టే శ్రీశైలం. అన్నారు. శుక్రవారం రోజున. యాచారం మండల కేంద్రంలో.లోక్‌సభ ప్రతిపక్ష నేత, నిరాడంబరుడు, నిగర్వి,భావి భారత ప్రధానమంత్రి రాహుల్ గాంధీ . జన్మ దినం సందర్భంగా యాచారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం . ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు మరియు బ్రెడ్ ప్యాకెట్లు అందజేయడం జరిగింది ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాన్నమ్మ ఇందిరాగాంధి మరియు తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం పేద మధ్యతరగతి ప్రజల కోసం దేశంపై పట్టు వదలకుండా రాహుల్ గాంధీ .కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు ఎదురొడ్డి నిలబడి కొట్లాడు తున్న తీరు ప్రతి కాంగ్రెస్ నాయకుడు కార్యకర్త ఆదర్శంగా తీసుకుని వారిని ప్రధాన మంత్రి చేసేందుకు కంకణ బద్ధులై పని చేయాలని కోరారుఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల్ అధ్యక్షులు పాశం జయప్రకాష్ మేడిపల్లి నక్కర్త ఉప సర్పంచ్ దెంది మధూకర్ రెడ్డి ,సీనియర్ నాయకులు గౌరారం వెంకట్ రెడ్డి, చీర శేఖర్ సంగెం మల్లేశ్ , మాజీ వార్డు సభ్యులు. ఎట్టి లక్ష్మయ్య. సంగం రవి. ఎడెల్లి యాదయ్య. రఘు మా రెడ్డి. ముత్యాల రెడ్డి.మల్కిజ్ గూడ గ్రామ వార్డు సభ్యులు చీర మహేష్ ,బోడ మధు , రెడ్డి వెంకట్ రెడ్డి కేశమోని బుచ్చయ్య, వరికుప్పల యాదయ్య, బోడ రమేష్ ,యూత్ కాంగ్రెస్ నాయకులు ఎరుకలి చింటు, ఆరేపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

## మున్సిపల్‌లో రాహుల్‌గాంధీ పుట్టిన రోజు కేక్ కటింగ్

**శామీర్‌పేట, జూన్ 19, ప్రభాతవార్త:**

ఏఐసిసి కాంగ్రెస్ నాయకులు, లోకసభ (కాంగ్రెస్ పార్టీ) ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పుట్టినరోజును కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. అలియాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొని కేకను కట్ చేసి రాహుల్‌గాంధీ పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు సామల జశ్వంత్‌రెడ్డి, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు టి.రాము, ఎ.వినోద్, టి.లక్ష్మయ్య, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అలియాబాద్‌లోని బస్టాప్ వద్ద జరిగిన లోకసభ కాంగ్రెస్ ప్రతిపక్షనేత

## దేవాలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**కందుకూరు, జూన్ 19, (ప్రభాతవార్త):** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి తన స్వగ్రామమైన కందుకూరు మండలం తిమ్మాపూర్ గ్రామంలో తన చొరవతో నిర్మించిన సీతారామస్వామి ఆంజనేయస్వామి దేవాలయం నిర్మించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారీ ఎత్తున పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనాలు తీసుకున్నారు. దైవచింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలియజేశారు ప్రజలంతా దేవుని కృపా కటాక్షాల వలన ఆనందంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అందెల శ్రీరాములు, బొక్క నరసింహారెడ్డి, లక్ష్మి ్మ నరసింహ రెడ్డి, పాపయ్య గౌడ్, దేవేందర్ రెడ్డి, జంగయ్య యాదవ్, మల్లారెడ్డి, జంగారెడ్డి, తదితరులు

# విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

**పెద్దేముల్, జూన్ 19, ప్రభాతవార్త:** వైద్యాధికారులు సమయపాలన పాటించి, రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని డిఎంహెచ్ఓ సుధాకర్‌లాల్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని రోగుల పరిస్థితి, వైద్య సేవలు, మందుల నిల్వలు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించి, సిబ్బంది హాజరు వివరాలు, విధుల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా గుర్తించిన లోపాలపై సంబందిత సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా డిఎం హెచ్ఓ సుధాకర్‌లాల్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించాలని, మందుల కొరత లేకుండా చూడాలని డాక్టర్ శ్వేతను ఆదేశించారు. ప్రభుత్వ వైద్యసేవలను ప్రజలకు న వ ం ర్థ వ ం త ం గా అందించేందుకు చర్యలు తీ స ు క ో వా ల ని సూచించారు. ప్రతి గురువారం పాఠశాలలకు, హస్టల్లకు వెళ్లి విద్యార్థుల పరిస్థితులను తెలుసుకొని జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు.



రోగితో మాట్లాడుతున్న డిఎంఎచ్ఓ



మందుల స్టాక్ వివరాలను తెలుసుకుంటున్న డిఎంహెచ్ఓ

ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని ఆ గ్రామంలో ప్రతిఒక్కరికి కంటి చూపు అందించే లక్ష్య సాధనకు కృషిచేస్తామని అన్నారు. ప్రస్తుతం పెద్దేముల్ ఆరోగ్య కేంద్రంలో 12 గంటలు వైద్యసేవలు అందిస్తున్నారని, మునుముందు 24 గంటలు వైద్యసేవలు అందేలా కృషిచేస్తామని అన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రాధాన్యతని, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో డెమో శ్రీనివాస్, ప్రోగ్రాం ఇంచార్జ్ మహేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**మేడ్చల్, జూన్ 19, ప్రభాతవార్త :** ప్రభుత్వాలు అందజేసే ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని అత్వెల్లి గ్రామానికి చెందిన దివంగత కేశవులుకు సిఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ. 30 వేలు మంజూరయ్యాయి. ఈ ఫండ్ చెక్కును లబ్ధిదారుడి కుటుంబ సభ్యుడు అభిలాష్‌కు ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మండల ఈశ్వరయ్య, మండల రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చౌదరిగూడ ఓయూ కాలనీలో ఎంపి నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ




చౌదరిగూడ ఓయూ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టిభూమి పూజ చేసిన బీజేపీ నాయకులు, మాజీ ఎంపీపీ వై. సుదర్శన్‌రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 19, ప్రభాత వార్త:** చౌదరిగూడ ఓయూ కాలనీలో ఎంపీ ఈటల రాజేందర్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి బీజేపీ నాయకులు మాజీ ఎంపీపీ వై. సుదర్శన్‌రెడ్డి శుక్రవారం కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి మాట్లాడుతూ ఓయూ కాలనీ అభివృద్ధికి ఎంపి నిధులు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఓయూకాలనీలో రెండు రోడ్లను సిసి రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్ పటేల్, రమేశ్ నాయుడు, గుండె నరేశ్, సతీశ్, జగదీశ్ గౌడ్, నవీన్, కాలనీ అసోసియేషన్ సభ్యులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

100 గ్రాముల గంజాయితో పాటు బైక్ స్వాధీనం

**ఘట్‌కేసర్, జూన్ 19, ప్రభాత వార్త:** అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారివద్ద నుండి వంద గ్రాముల గంజాయితో పాటు మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఘట్‌కేసర్ పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్సై హీనా సిబ్బందితో కలిసి లింగాల కుంట, శ్రీనివాస్‌నగర్‌లో రాత్రివేళ పేట్రోలింగ్ నిర్వహిస్తూ ఓ మోటార్‌సైకిల్‌ను ఆపి సోదా చేయగా వారి వంద గ్రాముల గంజాయి లభ్యమైంది. దీంతో బైకిస్టులు బోడుప్పల్‌కు చెందిన చీరాల సాయిరామ్ ( 29 ),బీబీనగర్‌కు చెందిన డి. బాస్కర్ ( 20)లను అదుపుతీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద పట్టుబడిన వంద గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని ప్రశ్నించగా అవుశాపూర్‌కు చెందిన మన్సూర్ సయ్యద్ నుండి 200 గ్రాముల గంజాయి కొనుగోలు చేశామని అందులో నుండి వంద గ్రాముల గంజాయి విక్రయించినట్లు తెలిపారు. దీంతో పోలీసులు నిందితుల నుండి వందగ్రాముల గంజాయితో పాటు మోటర్‌సైకిలునుస్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితులు ఇద్దరిని కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఘట్‌కేసర్ సీఐ బాలస్వామి తెలిపారు.

## విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

సర్పంచ్ నరసింహులు యాదవ్

**కుల్కచర్ల,జూన్ 19, ప్రభాతవార్త:** విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సర్పంచ్ నరసింహులు యాదవ్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకుఓఆర్ఎస్ ప్యాకెట్లు, విటమిన్ ట్యాబ్లెట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరసిహుములు యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్య,వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించిందని విద్యార్థుల చదువుల పట్ల, విద్య పట్లశ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త, ఉపాధ్యయులు తదితరులు పాల్గొన్నారు.



## కోల్కుంద సర్పంచ్ కీర్తిరామకృష్ణకి సన్మానం

**మోమిన్‌పేట్, జూన్ 19. ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండలం కోల్కుంద గ్రామానికి చెందిన మహిళా సర్పంచ్ కరణం కీర్తిరామకృష్ణ తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యధర్శిగా మోమిన్‌పేట్ మండలానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం అని బీసీ విధ్యార్థి సంఘం జాతీయ జాయింట్ కన్వీనర్ ఈశ్వర్ నాయి పేర్కొన్నారు. గురువారం బీసీ సంఘం తరపున కోల్కుంద సర్పంచ్ కరణం కీర్తిరామకృష్ణ దంపతులను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బీరప్ప, మల్లేశం, రవిందర్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్భంగా కీర్తిరామకృష్ణ మాట్లాడుతు అతిచిన్న వయసులోనే రాజకీయ లక్షణాలు కల్గిన బీసీ జాతీయ నాయకుడు ఈశ్వర్‌ను సన్మానించి అభినందించారు.

## మార్కెట్ కమిటికి కేటాయించిన భూమిని చూపించండి

మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు



తాసిల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు

**కుల్కచర్ల,జూన్ 19 ప్రభాతవార్త:** మార్కెట్ కమిటికి కేటాయించిన భూమిని చూపించాలని మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు శుక్రవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ పురుషోత్తంకు స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. గత 2022-23లో సర్వెనంబర్ 637,ఫి లో 10 ఎకరాల 36 గుంటల భూమిని కేటహించడం జరిగిందని అట్టి భూమిని సర్వే చేసి మార్కెట్ కమిటికి అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు వంశిధర్ రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన అధ్యక్షులుగా రఘునందన్‌గౌడ్

**పెద్దేముల్, జూన్ 19, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన అధ్యక్షులుగా రఘునందన్‌గౌడ్ ఎన్నికయ్యారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు బాల్‌రాజ్, సెక్రెటరి విజయకుమార్,ఆచారీ శ్రీనివాస్, చందర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, భద్రత, విద్యుత్ రంగ అభివృద్ధి కోసం యూనియన్ పని చేస్తుందని అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృష చేస్తామని అన్నారు. నూతన కార్యవర్గంలో వికారాబాద్ జిల్లా పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన అధ్యక్షులుగా రఘుందన్‌గౌడ్, సెక్రెటరిగా నర్సిములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకట్‌రాంరెడ్డి, జాయింట్ సెక్రెటరిగా ఆనంద్‌కుమార్ గౌడ్, ట్రెజరర్‌గా భాస్కర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

## రైతు బీమా క్లెయిమ్‌లను త్వరలోనే క్లియర్ చేస్తాం

జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. శైలజ

**రంగారెడ్డి అర్బన్, జూన్ 19, ప్రభాతవార్త:** అర్హులైన రైతు బీమా క్లెయిమ్‌లను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. శైలజ తెలిపారు. రైతు బీమాకు ఏది ధీమా? శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన వార్త దిన ప్రతీకలో వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. అయితే కొన్ని కేసుల్లో మరణించిన రైతుల నామినీలు లేదా చట్టబద్ధ వారసులకు సబంధించి అవసరమైన పత్రాలను పూర్తి స్థాయిలో సమర్పించడంలో ఆలస్యం చేయడం వల్ల క్లెయిమ్‌ల పరిష్కారం జాప్యం అవుతోందని పేర్కొన్నారు. అనేక సందర్భాల్లో ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, మరణ ధృవీకరణ పత్రాలు, చట్టబద్ధ వారసత్వ ధృవపత్రాల్లో అసంపూర్ణతలు లేదా వ్యత్యాసాలను గుర్తించామని చెప్పారు. ఈ నేపథ్యంలో అదనపు సమాచారం కోరడం, పత్రాల ధృవీకరణ చేపట్టడం వంటి ప్రక్రియలకు మరింత సమయం పడుతోందన్నారు.

రైతు బీమా పరిహార మొత్తాన్ని అవసరమైన పత్రాలన్నీ పూర్తిగా పరిశీలించి ధృవీకరించిన తర్వాత మాత్రమే ఎల్ఐసీ నేరుగా నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం వ్యవసాయ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నామినీలకు అవసరమైన సహాయం అందిస్తూ ఎల్ఐసీతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. అన్ని అర్హమైన రైతు బీమా క్లెయిమ్‌లను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు శాఖ కట్టుబడి ఉందని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. శైలజ పేర్కొన్నారు. నామినీలు అవసరమైన పూర్తి పత్రాలను ఆలస్యం చేయకుండా సమర్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రైతు కుటుంబాలకు బీమా సాయం అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.




## సర్ సర్వేని సమర్ధవంతంగా నిర్వహించాలి

ఆర్డిఓ జగదీశ్వర్ రెడ్డి

**కందుకూరు, జూన్ 19, (ప్రభాతవార్త):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్ సర్వే కార్యక్రమం ఈనెల 25 నుండి జూలై 24 వరకు కొనసాగుతుందని ఈ కార్యక్రమాన్ని నిర్వహించి బిఎల్వోలు సూపర్వైజర్లు నిబంధనల కనుగుణంగా నడుచుకోవాలని సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కందుకూరు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బిఎల్ఓలకు సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మరియు కందుకూరు తహసిల్దార్ గోపాల్ ట్రైనింగ్ ఇచ్చే ఉపాధ్యాయులు చైతన్యకుమార్, మరియు యాదగిరి రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సర్ సర్వే కార్యక్రమాల్లో బి ఎల్ ఓలది కీలకమైనపాత్ర అని సూచించారు. ఈ సర్వే దేశ ప్రగతికి ప్రధానమైనదని వివరాలను పూర్తిస్థాయిలో ట్రైన్‌ని ఉపాధ్యాయులు అందించిన సూచనలను సలహాలను అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. బి ఎల్ వోలు నిర్వహించే సర్వేలో సూపర్వైజర్లు ఎప్పటికప్పుడు సూచనలను సలహాలను అందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## వర్షపు నీరు నిల్వఉండకుండా చూడండి

అధికారులకు ఎంఎంసీ కమిషనర్ ఆదేశాలు



ఘట్‌కేసర్ సర్కిల్‌లో ఎంఎంసీ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి లోతట్టు ప్రాంతాలను సందర్శించి పరిశీలిస్తున్న దృశ్యం.

**ఘట్‌కేసర్, జూన్ 19, ప్రభాత వార్త:** వర్షాకాలంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను కమిషనర్ శుక్రవారం పర్యటించి ప్రధానంగా నీరు నిలిచిపోయే ప్రాంతాలను సందర్శించి కొనసాగుతున్న వర్షపునీటి నిర్వహణ పనుల పురోగతిని సమీక్షించారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని అవుశాపూర్, పోచారం డివిజన్ పరిధిలోని అరుంధతి కాలనీ, హిమగిరి కాలనీ, ఎన్‌టీపీసీ ఎక్స్ రోడ్డు, ఘట్‌కేసర్‌లోని బుగ్గనగర్ కాలనీ తదితర ప్రాంతాలను సందర్శించి వర్షపు నీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో పాటు డిప్యూటీ కమిషనర్ ఎ. వాణిరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూ టివ్ ఇంజినీర్ నరేశ్‌కుమార్, హైడ్రా జోనల్ ఇంఛార్జీ మోహన్‌రావు, హెచ్‌ఎండీఏ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివారెడ్డి, ఘట్‌కేసర్ సర్కిల్ అసిస్టెంట్ ఇంజనీర్ రవి కిరణ్, విశేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




ఎస్ ఐ ఆర్ శిక్షణలో మాట్లాడుతున్న తాసిల్దార్ రమేష్ కుమార్

## బి ఎల్ వో లకు ఎస్ ఐ ఆర్ పై శిక్షణ

**తలకొండపల్లి జూన్ 19, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నాడు ఎస్ ఐ ఆర్ పై బి ఎల్ ఓ లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసిల్దార్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో తలకొండపల్లి కేంద్రంలోని రైతు వేదిక ఆవరణంలో మండలంలోని అన్ని గ్రామాల వీఎల్వోలు, బి ఎల్ ఏ లకు ఎస్ ఐ ఆర్ పై శిక్షణ నిర్వహించి పలు సూచనలు సలహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ రమేష్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలు తాండాలలో వీఎల్ఓ లు ప్రతి ఇంటికి తప్పనిసరిగా వారికి పూర్తి వివరాలు అందజేసే విధంగా చూడాలని, 2002 కంటే ముందు ఉన్న వారి వివరాలు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఏదో ఒక గుర్తింపు కార్డులను అందజేసే విధంగా చూడాలని ఆయన అన్నారు. గ్రామాలలోని ప్రజలందరికీ తెలియజెప్పి ప్రతి ఒక్కరు ఎస్ఐఆర్లో పాల్గొని వివరాలు ఇవ్వవలసిందిగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్, ఆర్ ఐ లు, జిపిఓ లు ఆయా గ్రామాల బిఎల్ ఓలు, బి ఎల్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.



నాగర్ కర్నూల్ వెళ్తున్న బిజెవైఎం నాయకులు

## నాగర్ కర్నూల్‌కు తరలిన బిజెవైఎం నాయకులు

**తల కొండపల్లి జూన్ 19, ప్రభాతవార్త:** తెలంగాణ బిజెవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే బీజేవైఎం సమావేశానికి తలకొండపల్లి మండలం నుంచి బిజెవైఎం కార్యకర్తలు తరలి వెళ్లారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బిజెవైఎం కన్వీనర్ పద్మ అనిల్ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల నుంచి బిజెవైఎం కార్యకర్తలు తరలివెళ్లారు.

ఈ సందర్భంగా పద్మ అనిల్ మాట్లా డుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో సుస్థిర పాలనతో పాటు ఎన్నో మార్పులకు చోటు చేసుకుందని దేశంలోని యువత మళ్లీ నరేంద్ర నరేంద్ర మోడీ వైపు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం తాలూకా నాయకులు పద్మా అనిల్ వెంకటేష్ ఈస ప్రవీణ్ పద్మశ్రీ గారి రొయ్యల గణేష్ శ్రీధర్ అనిల్ రమేష్ రాకేష్ కుమార్ మధుకర్ జగన్ బాలరాజు వెంకటేష్ ఈస ప్రవీణ్ పద్మశ్రీ గారి రొయ్యల గణేష్ శ్రీధర్ అనిల్ రమేష్ రాకేష్ కుమార్ మధుకర్ జగన్ బాలరాజు తదితరులు ఉన్నారు.

## నేడు కరెంట్ బంద్

**మేడ్చల్, జూన్ 19. ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని కండ్లకోయ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సాయిగీతాశ్రమం, కేవీ రెడ్డి నగర్ ఫీడర్ ఏరియాలో నేడు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ గుండ్లపోచంపల్లి ఏఈ విజయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెట్ల కొమ్మల తొలగిస్తున్నందున సాయిగీతాశ్రమం ఫీడర్ పరిధిలో సాయిగీతాశ్రమం రోడ్డు, పీటీసీ, మై ప్లేస్ అపార్ట్‌మెంట్, లక్ష్మీ ఇన్‌ఫ్రా, ప్రెస్టేజ్ పార్క్, జయదర్శిని ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో నేడు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా కేవీ రెడ్డి నగర్ ఫీడర్ పరిధిలోని కేవీ రెడ్డి నగర్, మైపీ విల్లాస్, ఆంథమ్ విల్లాస్, బిగ్ బాస్కెట్, యూఎస్‌డీ ఆర్కెడ్ ప్రాంతాల్లో నేడు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కరంట్ సరఫరాను ఉండదని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.



మేడ్చల్‌లోని దుకాణంలో తనిఖీలు చేస్తున్న డ్రగ్స్ ఇనెస్పెక్టర్ మౌనిక

## మేడ్చల్‌లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

**మేడ్చల్, జూన్ 19, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలో పలు వ్యాపార దుకాణాల్లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మౌనిక శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. కిరాణా షాపులు, ఫ్యాన్సీ స్టోర్లు, బ్యూటీ పార్లర్లలో విక్రయిస్తున్న ఉత్పత్తుల నాణ్యత, గడువు తేదీలు, లేబులింగ్, నిబంధనల అమలును పరిశీలించారు. వ్యాపారులు తప్పనిసరిగా చట్టబద్ధమైన ఉత్పత్తులనే విక్రయించాలని, గడువు ముగిసిన వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని అన్నారు.

## సాయిగీతాశ్రమంలో 21న యోగా మహోత్సవం

**మేడ్చల్, జూన్ 19, ప్రభాతవార్త :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న కండ్లకోయలోని సాయిగీతాశ్రమంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆశ్రమ నిర్వహకులు పేర్కొన్నారు. ప్రకృతి ఒడిలో, 550కు పైగా దివ్య వృక్షాల నడుమ ప్రశాంతమైన వాతావరణంలో ప్రత్యేక యోగా మహోత్సవంలో ఆశ్రమ వ్యవస్థాపకులు సద్గురు సాయికుమార్ ఆధ్వర్యంలో యోగా నిపుణులు పాల్గొని యోగా ప్రాముఖ్యత, ఆరోగ్యకర జీవన విధానం, మానసిక ప్రశాంతతపై విలువైన సందేశాలను అందించనున్నారని తెలిపారు. 21న ఉదయం 6.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.

## శనైశ్వరాలయంలో పూజా సామాగ్రి విక్రయానికి వేలం పాట

ఈఓ నరేందర్

**మోమిన్‌పేట్, జూన్ 19. ప్రభాతవార్త:** మోమిన్‌పేట మండల పరిదిలోని ఎన్కతల గ్రామంలో కొలువైన శ్రీశ్రీ శంకర్ భారత్ మహారాజ్ ఆశ్రమంలోని శ్రీ శనైశ్వరాలయ పూజా సామాగ్రి, కొబ్బరికాయల వేలం ఈ నెల 29, సోమవారం సంవత్సరకాలం విక్రయానికి వేలం పాట నిర్వహించనున్నట్లు దేవాదయశాఖ, ఆలయ కార్యనిర్వహణాధి .కారి నరేందర్ తెలిపారు. ఈ సంధర్భంగా శుక్రవారం ప్రభాతవార్తతో ఈఓ మాట్లాడుతు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు ఈ సంవత్సరం కూడా వేలం పాట ఈనెల 29, సోమవారం రోజు స్వామివారి పూజా సామాగ్రిని విక్రయించుకునేందుకే ఈ వేలం పాట నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ వేలంపాట కార్యక్రమంలో పాల్గొనేవారు ఆలయ కమిటీకి ఏలాంటి సంబంధం లేనివారు అర్హులని తెలిపారు. సంవత్సరకాలం ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి సంభందించిన వస్తువులను విక్రయించుకొనే వారు 10, పదివేల రూపాయల నగదును చెల్లించి వారే ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆయన తెలిపారు. వేలం దక్కించుకున్నవారు అదేరోజు 50 ,శాతం చెల్లించి రసీదు పొందవచ్చని సూచించారు. ఈ వేలం పాట ఈనెల 29, సోమవారం 11,30 నిలకు, భహిరంగ వేలం పాటలో అర్హులైనవారు సంవత్సరకాలం పాటు దేవాదయ శాఖ నిర్నయించిన ధరలకే విక్రయించాలని నిర్వాహకులు నరేందర్ తెలిపారు.

## బిజెపిసి రాష్ట్ర యువజన వైస్ చైర్మన్‌గా కార్తీక్ యాదవ్

**పరిగి ,జూన్ 19, ప్రభాతవార్త :**

తెలంగాణ బస్తీల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర యువజన విభాగం వైస్ చైర్మన్‌గా కార్తీక్ యాదవ్ నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేఏసీ రాష్ట్ర చైర్మన్ గోసుల శ్రీనివాస్ యాదవ్ , రాష్ట్ర యువజన చైర్మన్ సాయి ఆద్వర్యంలో కార్తీక్ ను ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భగా కార్తీక్ మాట్లాడుతూ, తనను



నియమాక పత్రాన్ని అందుకుంటున్న కార్తీక్ యాదవ్

బీజేఏసీ రాష్ట్ర యువజన విభాగం వైస్ చైర్మన్ గా నియమించిన రాష్ట్ర చైర్మన్ గోసుల శ్రీనివాస్ యాదవ్ , రాష్ట్ర వైస్ చైర్మన్ శ్రీ సల్ల శ్రీనివాస్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపుతూ, యువతకు మద్దతుగా నిలుస్తూ, బస్తీ ప్రజల కష్టాలకు అండగా నిలబడతామని కార్తీక్ తెలిపారు. రాష్ట్ర యువజన చైర్మన్ సాయి కుమార్, మందుల విఘ్నేష్ , నరేష్ , అనిల్ , వంశీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అధికారి ప్రజల మన్ననలు పొందాలి

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 19,(ప్రభాతవార్త):** అధికారులు ప్రజల్లో మమేకమై వారి మన్ననలను పొందాలని ఎంపిడిఓ హాన్మంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రైతు వేదికలో బదిలిపై వెల్లిన ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, పంచాయితీ కార్యదర్శులకు సన్మాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలకు ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలను అందించడంలో అధికారుల పాత్ర కీలకంగ ఉంటుదని అన్నారు. ప్రభుత్వాని ప్రజలకు అధికారులు వారధిగ పని చేయాలని సూచించారు. గ్రామాలలో రాజకీయాలకు తావివ్వకుండ పనిచేయాలని ఆయన పెర్కోన్నారు. బదిలిపై వెల్లిన ఎంపిడిఓ, పంచాయితీ కార్యర్శులు ప్రజలకు ఎంతో అందుబాటులో ఉన్నారని మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు అన్నారు. అనంతరం ఎంపిడిఓ, పంచాయితీ కార్యదర్శులను అధికారలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు శాలువాలతో సన్మాణించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, సర్పంచ్‌లు చందునాయర్, నీలయ్య, నర్సింహులు, జంగయ్య, నాయకులు చలివేంద్రంపల్లి రాజు. అంజనేయులు, యాదయ్య, మల్లెష్, పంచాయితీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వృద్ధుడు మృతి

**శంషాబాద్ జూన్19ప్రభాతవార్త :** గుర్తుతెలియని ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన శంషాబాద్ ఆర్‌జిఐఎ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... శంషాబాద్‌లోని లిమ్స్ హాస్పిటల్ సమీపంలోని ఫ్లైఓవర్ కింద ఓ 60ఏళ్ల గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెంది ఉన్నాడని సమాచారం అందడంతో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అయితే వృద్ధుడి కుడికాలు విరిగి బిక్షటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడని అనార్యో సమస్యలతో మృతి చెంది ఉండోచ్చని స్థానికులు పేర్కొన్నారు. వృద్ధుడి అచూకి తెలిసిన వారు ఎవ్వరైనా ఉంటే 8712663310, 8712567977లను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## నాగసమందర్ ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

సేవలపై డీఎంహెచ్‌ఓ సుధాకర్ లాల్ ఆరా



**ధారూర్, జూన్ 19, ప్రభాత వార్త:** ధారూర్ మండల పరిధిలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుధాకర్ లాల్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి క్షుణ్ణంగా ఆరా తీశారు. జీవన శైలి వ్యాధుల బారిన పడిన వారికి నిరంతరం పరీక్షలు నిర్వహిస్తూ, మందులను సకాలంలో అందేలా చూడాలని స్థానిక వైద్యాధికారి డాక్టర్ జ్యోతిని ఆయన ఆదేశించారు. అనంతరం ఈ నెల 28వ తేదీ నుండి ప్రారంభం కానున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో కార్యక్రమం పకడ్బందీగా జరిగేలా చూడాలని ఆయన సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఏమాత్రం నిరక్ష్యం వహించకూడదని ఆయన అధికారులను హెచ్చరించారు.

# మంచి విద్యతో విద్యార్థులను తీర్చిదిద్దాలి

: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్ జూన్ 19,ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయులు ఉత్తమంగా తీర్చిదిద్ది మంచి భవిష్యత్తు అందించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని నానాజీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లవి ఇంటర్ నేషనల్ స్కూల్‌ను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాన్ని ప్రాంతాల విద్యార్థులకు మంచి చదువులు అందించాలనే ఉద్దేశ్యంతో గ్రామంలో స్కూల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని మంచి విద్యాను అందించి విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న స్కూల్ నిర్వాహకులు

# హెల్మెట్ ఉంటేనే భద్రత.. ట్రాఫిక్ నియమాలే ప్రాణాలకు రక్షణ



వాహనదారులకు హెల్మెట్‌లు అందజేస్తున్న డిసిపి శివమ్ ఉపాధ్యాయ,పోలిసులు

**కొత్తూరు, జూన్ 19, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపల్ పరిధిలోని కొత్తూరు వై జంక్షన్ వద్ద ఇన్స్పెక్టర్ నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాఫిక్ భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డిసిపి శివమ్ ఉపాధ్యాయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాల పాటనే ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్‌ను వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయక ప్రాణాలు బలవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు పోలీసులు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. భద్రత ప్రాముఖ్యతను వివరించడంతో పలువురు అక్కడికక్కడే హెల్మెట్లు కొనుగోలు చేసి ధరించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీ, షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ, కొత్తూరు ఎస్‌హెచ్ఓ, పోలీసు సిబ్బంది, మున్సిపల్ కమిషనర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఆవుల పాకలో విషాదం

- జీవనాధారం కోల్పోయిన రైతు
- యూరియా కలిపిన నీరు తాగి 8 ఆవుల మృతి..
- కుమ్మరిగూడలో విషాదం
- కన్నీళ్లు మిగిల్చిన ఆవుల మృతి
- రైతుకు న్యాయం చేయాలంటూ డిమాండ్



మృతి చెందిన ఆవులను పరిశీలిస్తున్న నాయకులు,తదితరులు

**కొత్తూరు, జూన్ 19, ప్రభాతవార్త;** మూగజీవాలపై జరిగిన అనుమానాస్పద ఘటన ఓ రైతు కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. శుక్రవారం కొత్తూరు మున్సిపల్ పరిధిలోని కుమ్మరిగూడకు చెందిన రైతు బండారి రఘునందన్‌కు చెందిన 08 ఆవులు యూరియా కలిపిన నీటిని తాగి మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. రైతు కుటుంబానికి జీవనాధారంగా ఉన్న ఆవులు ఒక్కసారిగా మృతి చెందడంతో యజమాని బండారి రఘునందన్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆవులకు నీరు అందించే సమయంలో ఉద్దేశపూర్వకంగా యూరియా కలిపి ఉండవచ్చని యజమాని అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. ఘటన అనంతరం ఆవుల కాపరిగా పనిచేస్తున్న వ్యక్తి పాకా నుంచి పరారవడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, దేవేందర్ యాదవ్, కోస్గి శ్రీనివాస్ తో కలిసి ఘటన స్థలాన్ని సందర్శించి మృతి చెందిన ఆవులను పరిశీలించారు. అనంతరం బాధిత రైతు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్పు తెలిపారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, రైతు కుటుంబానికి జరిగిన నష్టం ఎంతో బాధాకరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతుకు తగిన ఆర్థిక సహాయం అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని అధికారులను కోరారు. మృతి చెందిన ఆవుల వద్ద యజమాని రోదించిన దృశ్యాలు స్థానికులను కలచివేశాయి. ఈ ఘటనపై గ్రామంలో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్, చంద్రకళ రాజేందర్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు రవి నాయక్, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటిని మళ్లించడానికి చర్యలు తీసుకోవాలి

**కీసర, జూన్19, ప్రభాతవార్త:**

వర్షపు నీటిని మళ్లించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంఎంసి కమీషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారుల వెంట నిలిచిపోయే ప్రాంతాలను విస్తృతంగా తనిఖీ చేశారు. రాంపల్లి ఎక్స్ రోడ్డు వద్ద నీరు నిలిచిపోయే ప్రాంతాన్ని తనిఖీ చేసి వర్షపు నీటిని సులభంగా మళ్లించడానికి మరియు భారీ వర్షాల సమయంలో ముంపును నివారించడానికి హెచ్‌ఎండిఏ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ వర్షాకాల సంసిద్ధత చర్యలలో భాగంగా నీటి నిల్వలకు గురయ్యే ప్రాంతాలు, ఓపెన్ నాలాలు, స్మార్ట్ వాటర్ డ్రెయిన్ల అనుసంధాన వ్యవస్థను పరిశీంచారు. భారీ వర్షాల సమయంలో నాలాలు పొంగిపోర్లే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి డ్రైనేజీ పనితీరును సమీక్షించారు. నాలాలు, స్మార్ట్ వాటర్ డ్రెయిన్లలో పేరుకుపోయిన మట్టి, చెత్తను వెంటనే తొలగించి డీ సిల్టింగ్ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను కమీషనర్ ఆదేశించారు. నీటి ప్రవాహనికి ఆటంకం కలిగించే అడ్డంకులను తొలగించి, వర్షపు నీరు నిరంతరాయంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో నాలాలు పొంగిపొర్లడం, నీటి నిల్వలు ఏర్పడడం వంటి సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టి వర్షాకాల అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ వాణిరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నరేష్‌కుమార్, హైడ్రా జోనల్ ఇంఛార్జి మోహన్‌రావు, హెచ్‌ఎండిఏ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శివారెడ్డి, ఘట్‌కేసర్ సర్కిల్ అసిస్టెంట్ ఇంజనీరు రవికిరణ్, విశేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాంపల్లి ఎక్స్ రోడ్డు వద్ద నాలాను పరిశీలిస్తున్న ఎంఎంసి కమీషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి



## వెల్జాల్ తెలంగాణ పబ్లిక్ స్కూల్ కు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని వినతి

**తలకొండపల్లి జూన్19, ప్రభాత వార్త;**

తలకొండపల్లి మండలం వెల్జాల్ పాఠశాలక్షు బస్సులు నడపాలని కోరుతుకల్వాకుర్తి డిపో మేనేజర్ కు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. వెళజల్ లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా రూపొందడంతో వెల్జాల్ పరిసర గ్రామాల నుంచి విద్యార్థులు గిశిళీ కు రావడం కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డీపోమేనేజర్ లక్ష్మి సుధను గిశిళీ కమిటీ సభ్యులుకలిశారు.. ఉదయం మిడ్జిల్ నుంచి వేముల, మసీగుండ్లపల్లి, చెన్నంపల్లి, వెంకటాపూర్, అంతారం మీదుగా వెల్జాల్ కు 9 గంటలకు..

ఆమనగల్లు నుంచి ఖానాపూర్, జంగారెడ్డి పల్లి, మెదక్ పల్లి, చౌదర్ పల్లి, మాదాయపల్లి మీదుగా వెల్జాల్ కు విద్యార్థులు రావడానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ డీఎం లక్ష్మి సుధకు టీపీఎస్ కమిటీ సభ్యులు విన్నవించారు.

వినతిపత్రం ఇచ్చిన వారిలో కమిటీ సభ్యులు శ్రీనివాస్ యాదవ్, వెంకట్ రెడ్డి, వానరాసి వెంకటేష్, సీహెచ్. విష్ణువర్ధన్, ముజ్జుబుర్ రెహమాన్, అంబాజీ, శివ విజయ్ కుమార్, అంజయ్యగౌడ్, అజీజ్, ఆరిఫ్, సూరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, సుదర్శన్, రాము పాల్గొన్నారు.

## కడ్తాల్‌లో బిఎల్ఓ, బిఎల్ఏలకు ఓటరు మ్యాపింగ్‌పై అవగాహన సదస్సు

.. పాల్గొన్న కల్వకుర్తి ఆర్డీఓ జనార్ధన్ రెడ్డి

**కడ్తాల్, జూన్ 19, ప్రభత వార్త :** కడ్తాల్ పట్టణ రైతు వేదికలో బిఎల్ఓలు, బిఎల్ఏ సూపర్వైజర్లు మరియు వివిధ పార్టీల బిఎల్ఏల కోసం ఓటర్ల జాబితా సవరణ సర్ మరియు ఓటరు మ్యాపింగ్‌పై అవగాహన సమావేశం శుక్రవారం తహశీల్దార్ జయశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి కల్వకుర్తి ఆర్డీఓ జనార్ధన్ రెడ్డి హాజరయ్యారు. మాస్టర్ ట్రైనర్ బిఎల్ఓలు, బిఎల్ఏలకు ఓటరు మ్యాపింగ్ చేసే విధానాన్ని క్లుప్తంగా వివరించారు. సమావేశంలో మాస్టర్ ట్రైనర్ మాట్లాడుతూ, ఈ నెల 25నుంచి సర్ ప్రక్రియలో భాగంగా ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందని తెలిపారు. ఓటరు మ్యాపింగ్ సరిగ్గా చేయడం వల్ల జాబితా సవరణ సులభమవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓలు, బిఎల్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## బొదునం పల్లిలో తీరిన మంచినీటి సమస్య

- ప్రశంసలు అందుకున్న సర్పంచ్, ఎమ్మెల్యే

**కేశంపేట, జూన్ 19, ప్రభాతవార్త :**

కేశంపేట మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామంలో గత కొంతకాలంగా నెలకొన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక చర్యలు చేపట్టారు. గ్రామంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉండటంతో గ్రామ సర్పంచ్ ఎదిరె నాగేశ్వర్ ఈ సమస్యను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి డీఎంఎఫ్‌టీఎస్ నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో గ్రామానికి అవసరమైన మూడు సింగిల్ ఫేజ్ మోటార్లను ఏర్పాటు చేసి మంచినీటి సరఫరాను మెరుగుపరిచారు. దీంతో గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం లభించింది. గ్రామంలో మంచి నీటి సౌకర్యం కల్పించబడటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సర్పంచ్ ఎదిరె నాగేశ్వర్‌తో పాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ మహ్మద్ భారీ, ఏఈ నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్, డిప్యూటీ సర్పంచ్ హరీష్ రెడ్డి, వార్డు సభ్యులు ఎదిరె బీరప్ప, పిప్పల నరేందర్, గ్రామ పెద్దలు మెల్గిరి యాదగిరి, ఎదిరె వెంకటేష్, పి. వెంకటయ్య, నర్సింహా, ఇమ్మిడి తిరుపతయ్య, పిప్పల అశోక్, ఎదిరె తిరుపతయ్య కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 4వ రాష్ట్ర మహా సభలు జయప్రదం చేయండి

జిల్లా అధ్యక్షులు పి అంజయ్య

**యాచారం, జూన్ 19, ప్రభాతవార్త:**

ఈనెల మహబూబ్ నగర్ లోజరిగే తెలంగాణ కార్మిక సంఘం. 4వ మహాసభలను. విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు పి అంజయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున ఆయన ఒక ప్రకటన రూపంలో తెలుపుతు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను. పోరాడి సాధించు కున్న కార్మిక కర్షక చట్టాలు కార్పొరేట్ శక్తులకు అప్ప చెప్పుతున్నారు పలితంగా వున్నవాడు ఆకాశాన్ని అందుకుంటుంటే లేనివాడు మరింత దరిద్రం లోకి నెట్టబడుతున్నారు వున్నవాడు లేనివాడు అనే అంతరాలు విపరీతంగా పెరిగి ఆకాలి దరిద్రం నిరుద్యోగం పెరుగుతున్నది కూలీ లకు అండగా కరువులో ఆకాలి తీర్చి భయంకరమైన కరోనా టైములో హైదరాబాద్‌లో వున్నా తిండి లేక అల్లాడిన ప్రజలకు ఎర్ర జండా పోరాట పలితంగా వచ్చిన ఉపాధి చట్టమే కాపాడింది . అట్లాంటి ఉపాధి హామీ చట్టం కేంద్ర బిజెపి ప్రభుత్వం ఓర్వలేక రెండవ సారి అధికారంలోకి వచ్చిన నాటినుండి పూర్తిగా తీసివేయడం కోసం అనేక చేర్పులు మార్పు లు చేసింది బడ్జెట్ తగ్గించడం కూలీలకు వున్నా అవకాశాలను రద్దు చేయడం చాట్టం లో ఏ పని చేసుకోవడానికైనా అవకాశం వుండే పనులు రద్దు చేసి కొన్ని పనులకు మాత్రమే పరిమితం చేశారు 2 పూటల ఫోటో విధానం తీసుకు రావడం వలన కొంత మందికి ఐరిస్ రాకపోవడంతో పనిలేక ఎట్లా బ్రతకాలి అని తిండి లేఖ ఇబ్బంది పడుతున్నారు ఫోటోల కోసం గంటల తరబడి నిలబడ వలసి వస్తుంది పలితంగా వేలాది మంది కూలీలు పనికి తగ్గినారు పెరుగుతున్న ధరలకు కూలి 800 పెంచాలి పని రోజులు 200రోజులు పెంచాలి కూలి డబ్బులు ప్రతి వార వారం రాక పోవడం మూలంగా కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు మూడు రోజులు జరిగే మహా సభలో ప్రభుత్వా లు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు కార్మిక చట్టాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించి జరిగే సభలో. భవిష్య కార్యాచరణ రూపొందిస్తారు ఆయన తెలిపారు.

## ఫర్టిలైజర్ యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు

.. ఎడిఏ శోభారాణి

**కడ్తాల్ జూన్ 19, ప్రభత వార్త :** రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా జూన్ 4వ తేదీ నుంచి ఎరువుల అమ్మకం ఫ్రేమ్ వర్కే పార్టిలేజర్ యాప్ ద్వారానే జరుగుతుందని ఏడిఏ శోభారాణి తెలిపారు. శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఏడిఏ శోభారాణి పరిశీలించారు. ఎరువుల బుకింగ్ విధానం. దానిలో సాంకేతిక సమస్యల గురించి ఎరువుల డీలర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడటం కడ్తాల్ మండలంలో ఇప్పటివరకు 53 శాతం మంది రైతులు ఇంత్రమే ఫార్మిక్ రిజిస్టా చేయించు కున్నారుని ఇంకా సుమారం 7 వేల పైచిలుకు సర్వేనెంబర్లు పార్మర్ రిజిస్టర్ చేయించు కోవలసిన ఉందని తెలిపారు, రైతులు తప్పక ఫార్మర్ రివార్ప్స్ చేయించు కుంటేనే ఎరు. ఎరువులు. పిమ్ కిసాన్. రైతు భరోసా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పొందుతారని తెలిపారు. ఎరువుల యాప్ కు సంబంధించి తలెత్తిన సాంకేతిక సమస్యలను ఎప్పటికపుడు పై అధికారుల పరిష్కారం అయ్యేలాగా చర్యలు చేసుకుంటున్నారని అన్నారు. రైతులు కేవలం వరి పంటనే కాకుండా మొక్కజొన్న. జొన్న. సజ్జలు. కంది. మినిమములు. పెసలు మొదలైన పంటలు వేయాలని సూచించాలి . ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయి అధికారి కవిత, ఎరువుల దుకాణాల డీలర్లు. రైతులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు

**చౌడపూర్, జూన్ 19, ప్రభాతవార్త :**



అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు,విద్యార్థులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కార్పోరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలం లోని కన్మన్ కల్వ ప్రభుత్వ పాఠశాలలో సాముహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యను పటిష్టం చేస్తుందని , విద్యార్థులకు అల్పా హారం, మద్యాహ్న భోజనంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు అశోక్ కుమార్, స్థానిక సర్పంచ్ కృష్ణవేణి రాజు , ఏఏపీ చైర్మన్ బేగం, ఉప సర్పంచ్ మనమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాము, ఎంపీటీసీ అంబి బాయ్, రాములు, సుదర్శన్ రెడ్డి, హెడ్ మాస్టర్ రమేష్., ఖాదర్, తదితరులు పాల్గొన్నారు

# హేమాద్రి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఘనంగా ప్రతిష్ట మండల పూజ



మహాశాంతి హోమంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ దంపతులు కందాడి హనుమంత్‌రెడ్డి



శ్రీ హేమాద్రి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**కీసర, జూన్19, ప్రభాతవార్త:**

రాంపల్లిదాయర గ్రామంలోని హేమాద్రి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీ వారి ప్రతిష్ట మండల పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. టీటీడి వేద పాఠశాల వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, స్వయంభూ శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి పంచామృత, అష్టోత్తర కలశ స్నపనము, మహాశాంతి హోమం ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వేద మంత్రోచ్ఛరణలతో నిర్వహించిన పుష్పయాగం కనుల పండువగా జరిగింది. వందలాది మంది భక్తులు పూజలలో పాల్గొని శ్రీ వారిని దర్శించుకున్నారు. దేవస్థానం తరపున భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ప్రముఖ భజన, ప్రవచ కర్త రాధాక్రిష్ణ శర్మ, కీసర సర్కిల్ డిప్యూటీ కమీషనర్ రామలింగం తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.